క్లుప్తంగా

నేడు ఆధార్ క్యాంపు

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి-2 సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల పరిధిలో ఆధార్ అవసరం ఉన్న వారికి తెలియజేసి ఆధార్ క్యాంపులో పాల్గొని ఆధార్ కార్డులను సవరించుకోవడం, కొత్తకార్డులు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

మా గ్రామంలో మద్యం షాపు వద్దు

సిద్దవటం: ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ సాయినగర్‌లో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంతం మహిళలు సోమవారం సిద్దవటం లోని ఎక్సైజ్ పోలీసుల స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. మద్యం మత్తులో నివాసాలకు సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని కోరారు. రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, మహిళలకు ఆటంకాలు కలిగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉప్పరపల్లెలోని సాయినగర్‌లో మద్యం షాపును గృహాల మధ్య ఏర్పాటు చేశారని, ఆ ప్రాంతం మహిళలు ఫిర్యాదు చేశారని తెలిపారు. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

రైల్వేకోడూరు అర్బన్: మాదకద్రవ్యాల జోలికి యువత పోవద్దని ఎస్ఐ నవీన్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వలన శారీరకంగా, మానసికంగా ఎంతో నష్టపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్రం, వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు రెడ్డేశ్వర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సుండుపల్లె: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నమయ్య జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు సూర్యుడు నాయక్ తెలిపారు. అన్నమయ్య జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడిగా సూర్యుడు నాయక్‌ను ఎన్నుకోవడంపై రాయవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన పాఠశాల సిబ్బందికి, వివిధ మండలాల పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు నాయక్, ప్రధానోపాధ్యాయుడు అమృనాయక్, రాజశేఖర్, ఆదినారాయణ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్) : ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియూ వయోవృద్ధుల సహాయ సంస్థకు చెందిన గుంటూరులోని బ్రెయిలీ ప్రెస్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మెషిన్ ఆపరేటర్ పోస్టుకు అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ కుమార్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెషిన్ ఆపరేటర్ పోస్టుకు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయస్సు సడలింపు వర్తిస్తుందన్నారు. అర్హత కలిగిన వారు తమ బయోడేటా వివరాలు, విద్యార్హతలు, అనుభవము, సర్టిఫికెట్ పత్రాలను జత పరిచి ఈ నెల 24వ తేదీలోపు ఏపీడీఏఎస్‌సీ కార్యాలయానికి పోస్టు ద్వారా కానీ పంపించాలని కోరారు.

ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజతం

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామ పంచాయతీ ఈడిగపల్లికు చెందిన సి. హరినాథ్ కుమారుడు సి. అభినయ్ బెంగుళూరులో జరిగిన సౌత్ జోన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి కాంపౌండ్ విభాగంలో రజిత పథకం సాధించాడు. ఈ సందర్భంగా విలు విద్యలో పథకం సాధించిన సి. అభినయ్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య సోమవారం అభినందించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

సుండుపల్లె: మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ, నల్లగుట్టపల్లి సమీపంలోని యానాది కాలనీ వాసులు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డికి గిరిజన సంఘం నాయకులు అమృనాయక్ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. బోరు పాడైపోవడంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేయించి ప్రజల దాహార్తి తీర్చాలని వారు కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్‌ను ఎంపీడీఓ ఆదేశించారు.

పేపర్ ప్రజెంటేషన్‌లో సత్తా

రాజంపేట: అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం వైష్ణవి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్ సువేష్మ అనే విద్యార్థులు ఎస్ఆర్ఐటీ ప్రొద్దుటూరు కళాశాలలో నిర్వహించిన టెక్నోహోలిక్స్-2కె 24 పేపర్ ప్రజంటేషన్‌లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు.

రోడ్డు ఇరుకు.. ప్రయాణం బెరుకు

రాజంపేటలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే పట్టణం ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అడుగు పెట్టే సందులేకుండా రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ కూడళ్ల వద్ద చక్రబంధంలా నాలుగు వైపులా వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. వెనక్కి తిరిగిపోలేక.. ముందుకు సాగలేక గంటలకొద్దీ రోడ్లపై నరకయాతన అనుభవిస్తున్నారు.



రాజంపేటలో వాహనాల రద్దీ

- రద్దీతో అవస్థలు
- వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం
- ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో తప్పని అవస్థలు

రాజంపేట రూరల్: రాజంపేట పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. అభివృద్ధికి తగ్గట్టు వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఇరుకు రోడ్లలో ప్రజలు, వాహనదారులు బెరుకు బెరుకుగా ప్రయాణిస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు చిన్న చిన్న వీధుల్లో కూడా ట్రాఫిక్‌తో పురపాలకులు నరకం చూస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి అంబులెన్స్ రావాలంటే ఈ రద్దీలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. జౌళీబజార్, కొలిమి వీధి, నూనెవారిపల్లి రోడ్డు, పొట్టి శ్రీరాముల వీధి, బీఎస్ హాల్ వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ వీధుల్లో ఏదైన వాహనం ఎదురుగా వస్తే వాహనదారులకు చుక్కలు కనిపిస్తాయి.

పోలీసులపై పనిబారం

పట్టణంలో డీఎస్పీ స్థాయి అధికారి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధికరించేందుకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికీ సత్ఫలితాలు రావడం లేదు. దీంతో వారిపై పనిబారం కూడా అధికమవుతోంది. రద్దీ మార్గాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తున్నారు. గతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధికరించేందుకు పోలీసు శాఖ కొన్ని ప్రణాళికలు చేపట్టింది. కానీ పట్టణ ప్రజలతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు నియమాలు పాటించకపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

ట్రాఫిక్‌తో సతమతం

పట్టణంలో ప్రధాన సెంటర్లో తోపుడు బండ్లు రోడ్డుకు ఇరువైపులా ఉండటంతో ట్రాఫిక్ నిత్యం నిలిచి పోతోంది. స్కూల్ బస్‌లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, నిత్యం కిక్కిరిసి ఉన్న రోడ్డులో ద్విచక్రవాహనదారులు, బాటచారులు నానా అవస్థలుపడుతున్నారు. అలాగే పండ్ల దుకాణాలు కూడా రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యగా మారింది. పెరుగుతున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను పార్క్ చేసుకునేందుకు పట్టణంలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం లేదు. దాంతో బైక్‌లను రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. చాలా వీధుల్లో ఆటోలు కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది.

వన్‌వేతో ట్రాఫిక్‌కు చెక్

పట్టణంలోని మూడు ప్రధాన రహదారులను కలిసే విధంగా చిన్న చిన్న రహదారులు ఉన్నాయి. అలాగే జాతీయ రహదారిలో నుంచి పట్టణంలోకి పలు రహదారులు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని వన్‌వే అమలు చేయడం ద్వారా పూర్తి స్థాయిలో ట్రాఫిక్‌కు చెక్ పెట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. వన్‌వే ఏర్పాటు చేయటం ద్వారా అటు ప్రజలకు, ఇటు వాహనదారులను ట్రాఫిక్ చక్రవ్యూహం నుంచి బయటపడవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



పట్టణంలో నెలకొంటున్న రద్దీ దృష్ట్యా వన్‌వే ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. ఆటోలు, ద్విచక్రవాహనాలు అధికంగా ఉండటం, రహదారులు ఇరుకుగా ఉండటంతో సమస్యగా మారింది. ప్రజలు, వాహనదారులు సహకరిస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

కె. యల్లమరాజు, అర్బన్ సీఐ, రాజంపేట

వన్‌వే ఏర్పాటు శ్రేయస్కరం



ఇరుకు రోడ్లలో ప్రయాణించాలంటే ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గంటలకొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉండటంతో వాహనాలపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. వన్‌వే అమలు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

ఎస్. వెంకటసుబ్బయ్య, ప్రభుత్వ ఉద్యోగి, రాజంపేట

భయంగా ఉంది



దుకాణానికి సరుకులు తీసుకెళ్లేందుకు ప్రతి రోజు రాజంపేటకు బైక్‌పై వస్తాను. అక్కడ ఉన్న ట్రాఫిక్‌లో ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఇరుకు రోడ్లతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

జి. శ్రీరాములు, చిరు వ్యాపారి, అనంతసముద్రం, పుల్లంపేట మండలం

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : రాష్ట్రంలో పిల్లలు, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల పట్ల మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు క్షీణించడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో 74 ఘటనలు జరగడం శోచనీయమన్నారు. ఘటనలు ఎందుకు, ఎలా జరుగుతున్నాయి? వాటిని ఎలా అరికట్టాలన్నా విషయాలపై జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి పోలీసులకు ఆదేశాలు ఇవ్వక పోవడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు రక్షణ కల్పించలేని పరిస్థితులు ఏర్పడినపుడు ప్రభుత్వాలు పరిపాలన చేయడం దండగన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి మహిళల భద్రత విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బద్వేలు ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పసిపిల్లలు, మహిళలపైన అత్యాచారాలు జరుగుతుండటం బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గాలివీడు : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎగువగొట్టివీడు హైస్కూల్ విద్యార్థులు కె.రెడ్డి ప్రియ, పి.సునీల్ కుమార్ నాయుడు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాడు జె.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర ఎయిడెడ్ హైస్కూల్ బయనపల్లి, కడపలో ఈనెల 21 వ తేదీ సోమవారం జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు కె.రెడ్డి ప్రియ (10 వ తరగతి) అండర్ 17 విభాగంలో , పి.సునీల్ కుమార్ (7వ తరగతి) అండర్ 14 విభాగంలో స్టాండ్‌బైగా ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాడు వెంకట్రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చెస్ పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్: ఈ నెల 29వ తేదీ నుంచి రెండు రోజుల పాటు సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 చెస్ పోటీలకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారిణి పీ.వినేనా ఎంపిక యింది. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్ఎం పీ.నాగమణి సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు.

పాలసీదారులకు నష్టం కల్గించవద్దు

రాజంపేట టౌన్: జీవిత బీమా సంస్థ పాలసీదారులకు నష్టం కలిగించేలా తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని లియాఫీ రాజంపేట శాఖ అధ్యక్షుడు ఏ.వెంకటసుబ్బయ్య, కార్యదర్శి ముద్దా శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవిత బీమా సంస్థ పాలసీదారులకు నష్టం కలిగించేలా తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో సోమవారం లియాఫీ యూనియన్ నాయకులు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య, శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ నుంచి పాలసీలపై జీవిత బీమా సంస్థ ప్రీమియం పెంచిందని దీనివల్ల పాలసీదారులపై భారం పడుతుందని తెలిపారు. అలాగే బోనస్‌ను తగ్గించడం వల్ల పాలసీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. జీవిత బీమా సంస్థ వ్యాపారాభివృద్ధికి అహర్నిశలు శ్రమించి, దేశంలో ఎల్ఐసీని అగ్రగామిగా నిలవడానికి నిరంతరం కృషి చేసే ఏజెంట్ల ఆదాయంలో కోత పడేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన క్లాబ్యాక్ కమీషన్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సుధాకర్‌రాజు, ప్రతినిధులు కొండారెడ్డి, పిచ్చయ్యనాయుడు, ఆవుల రమణయ్య, మోహన్ బాబు, హరి, పీఏ.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

భూ కబ్జాలే టీడీపీ నాయకుల లక్ష్యం

రాజంపేట రూరల్ : భూ కబ్జాలు చేయటమే టీడీపీ నాయకులు లక్ష్యంగా పెట్టుకొని అడ్డు వచ్చిన వారి ప్రాణాలను సైతం బలిగొనేందుకు వెనకాడటం లేదని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి వాపోయారు. ఓబులవారిపల్లి మండలం పెద్దఓరంపాడు పంచాయతీలోని పెరుమాళ్లవారిపల్లి గ్రామానికి చెందిన ఎస్సీలపై టీడీపీ నాయకులు చేసిన దాడిలో గాయపడి రాజంపేట ఏరియా ఆసుపత్రిలో ఉన్న దళితులను రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో పాటు ఆయన సోమవారం పరామర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు గుండాల వలె దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. పుల్లంపేట, ఓబులవారి పల్లి, చిట్వేలి మండాలల పరిదిలో ఈ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల కాలంలో వందలాది ఎకరాలు భూమి కబ్జాకు గురైందన్నారు. వీటి పై రెవిన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం సరియైన పద్ధతి కాదని హితబోదచేశారు. తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఉపేక్షించేదే లేదన్నారు.

ఎస్సీలకు రక్షణ లేదా

కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు రక్షణ, విలువ లేదా అని ఓబులవారిపల్లి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ప్రశ్నించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వెంట గన్‌మెన్లు లేకపోవటం చూస్తే కూటమి ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చే విలువ తెలుస్తుందని వాపోయారు. రాష్ట్రంలో ఎస్సీలు అంటే కూటమి ప్రభుత్వం పూచిక పుల్లగా చూస్తోందని వారి ప్రాణాలకు కూడా విలువ లేకుండా పోయిందని వాపోయారు. కార్యకర్తల కోసం ఎంతవరకైనా పోరాడతామని తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన వారిని పరామర్శించిన వారిలో మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి చేర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, చిట్వేలి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అదే విదంగా డీఎస్పీ ఎన్. సుధాకర్, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్‌నాయుడులు సైతం ఏరియా ఆసుపత్రికి వచ్చి దాడి వివరాలను సేకరించుకొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని కస్తూరాజుగారిపల్లి గ్రామం, దేవలంపల్లికి చెందిన రామచంద్రయ్య అనే వ్యక్తి సోమవారం లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో ఆకస్మాత్తుగా కిందపడటంతో తలకు బలమైన గాయం అయినట్లు లక్కిరెడ్డిపల్లి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సలీమ్ తెలిపారు. హుటాహుటిన గాయపడిన రామచంద్రయ్యను లక్కిరెడ్డిపల్లి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రామచంద్రయ్యను కడపకు తీసుకెళ్లారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి

రైల్వేకోడూరు అర్బన్: ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి జాన్ ప్రసాద్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై కూటమి నాయకుల వేధింపులు అధికమవుతున్నాయని, వేధింపులు ఆపాలని కోరారు. బుడుగుంటపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడకపోయినా ఆమెను తొలగించేందుకు జిల్లా ఏపీడీపై కూటమి నాయకులు ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు.

స్మశాన వాటిక ఆక్రమణలపై సర్వే

సుండుపల్లె: హిందువుల స్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతోందని మండల కేంద్రానికి చెందిన గుగ్గిళ్ల కృష్ణయ్య స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వేయర్‌లు కీర్తన, జగదీష్, విఆర్‌ఓ జయలక్ష్మీ సోమవారం సర్వే నిర్వహించారు. స్మశాన వాటిక స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు. స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాసభలు జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్: పట్టణంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరుగనున్న సీపీఎం అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సమాన్యులను ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. ఉద్యోగులు, కార్మికులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వలంటీర్లు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వాలంటీర్లు

రాయచోటి అర్బన్: తమను విధులలో కొనసాగించాలని వలంటీర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ పిలుపు మేరకు సోమవారం జిల్లాకు చెందిన వలంటీర్లు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేసి పెద్ద ఎత్తున బైఠాయించారు. ఈ సందర్భంగా వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మహేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను రద్దు చేసే యోచనను పాలకులు ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామాలు చేసిన వలంటీర్లను వెంటనే విధులలో కొనసాగించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, జిల్లా గౌరవాధ్యక్షుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

రాజంపేట: ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను మండల స్థాయి అధికారులు సత్వరమే పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి ఆదేశించారు. సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది ప్రజలు చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు తీసుకెళ్తున్నారని, అలా కాకుండా ముందుగా మండలాల్లోని అధికారులకు ఆ సమస్యలపై అర్జీలు అందించాలని అక్కడ పరిష్కారం కాకుంటే రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలని సూచించారు.

ఆంధ్రరత్న గౌరవ పురస్కారం ప్రదానం

ఒంటిమిట్ట: సంస్కృతి, సంప్రదాయాలలో తెలుగునేలకు గొప్ప గుర్తింపు ఉందని ఆంధ్రరత్న, ఒంటిమిట్ట పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు, హిందూ ధర్మం టెంపుల్ ప్రేయర్ సొసైటీ జాతీయ చైర్మన్ పసుపులేటి శంకర్ అన్నారు. సోమవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు కార్యాలయంలో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సామాజిక, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 24వ ఆత్మీయ పురస్కారాలు ప్రధానోత్సవంలో భాగంగా ఆంధ్రరత్న గౌరవ పురస్కారాన్ని పసుపులేటి శంకర్ అందుకున్నారు. ఈయనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో ప్రతిభాపాటవాలు కల్గిన 26 మంది కళాకారులకు జ్ఞాపికలను, పథకాలు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ గుణదల కార్పొరేటర్ సునీత, రాజమండ్రికి చెందిన సత్యనారాయణ, 26 మంది కళాకారులు పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు : తుపాను సమయంలో పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ టి.భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని తూముకుంట నాయునివారిపల్లెలో ఆదివారం పిడుగు పడిన ప్రమాదంలో 18 పొట్టేళ్లు మృతి చెందిన దృష్ట్యా పశువుల కాపరి గాయపడిన దృష్ట్యా సోమవారం ఆ గ్రామంలో పశువుల కాపరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను, అధిక వర్షాలు వచ్చే సమయంలో మెరుపులు, పిడుగుల భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం వచ్చేటప్పుడు పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు, పశువుల కాపరులు దగ్గరలో ఉన్న భవనంలోకి వెళ్లాలని తెలిపారు. చెట్ల కిందకు ఎలాంటి పరిస్థితుల్లో వెళ్లకూడదని సూచించారు. సెల్ ఫోన్లలో మాట్లాడకూడదని పేర్కొన్నారు. ఎత్తైన టవర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

వీరబల్లి: మండల కేంద్రంలో ముమ్మరంగా సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురికి కాలువలు శుభ్రం చేయడమే కాకుండా వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమాలు సర్పంచ్ జయరాణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్‌ను గ్రీన్ అంబాసిడర్‌లు ద్వారా చల్లించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు.

అప్పారాజుపేటలో పారిశుద్ధ్య పనులు

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్తా చెదారాన్ని తొలగించారు.

పీడీఎస్‌యూ సభలు జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్: ఈనెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో, నవంబరు 5న విజయవాడలోని ఎంబీవీకే భవన్‌లో నిర్వహించే పీడీఎస్‌యూ అర్థశతాబ్ద ఉత్సవ సభలను జయప్రదం చేయాలని ఈ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పిలుపునిచ్చారు. అర్థశతాబ్ద ఉత్సవాలకు సంబధించి పీడీఎస్‌యూ నేతలు పట్టణంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. పీడీఎస్‌యూ రాయచోటి నేతలు ప్రసాద్, ముబారక్, రామాంజులు, కిరణ్, అరుణ్, సుబ్రమణ్యంరెడ్డి, శివశంకర్ రెడ్డి, బాలాజీ, రాఘవ, చంద్రమౌళి పాల్గొన్నారు.

రెండు చోట్ల చోరీ

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు సమాచారం. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం ఈ రెండు చోరీల్లో 400 గ్రాముల బంగారంతో పాటు నగదు కూడా అపహరించినట్లు తెలుస్తోంది. ఘటనలపై అర్బన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే రాత్రి పది గంటల వరకు బాధితులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని అందుకే కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పడం గమనార్హం.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సిద్దవటం: దేశ సరిహద్దుల్లో ప్రజల కోసం విధులు నిర్వహిస్తూ తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు డి. నాగేశ్వరప్ప అన్నారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించి, వందన స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఇన్‌చార్జి నాగేశ్వరప్ప ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. 1959 అక్టోబర్ 21వ తేదీన భారత దేశంలోకి చైనా సైనికులు టిబెట్టు ద్వారా ప్రవేశించేందుకు ప్రయతించారని, చైనాతో భారత్ సీఆర్‌పీఎఫ్ దళాలు వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను అర్పించారని కొనియాడారు. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని పోలీసులు ధైర్యంగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రాణాలను లెక్కచేయక ప్రజాసేవలో నిమగ్నమవుతున్నామని చెప్పారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు మెమెంటోలను నాగేశ్వరప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఫారెస్టు రేంజర్ బి. కళావతి, బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు థియోఫిలాస, ఆలీబాషా, ఆర్ఐలు నాగా శ్రీనివాసరావు, సీఆర్‌కే రాజు, కె.వి. రమణ పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప తదితరులు

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఒంటిమిట్ట: తమ వృత్తిలో ప్రజలకు రక్షణ కల్పించే తరుణంలో తమ ప్రాణాలుసైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసు వీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్‌లు అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం నుంచి గ్రామ పురవీధులలో పోలీసులు, మండల ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.